క్లుప్తంగా

వైభవంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం



బెండపూడిలో కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

తొండంగి: మండలంలోని బెండపూడిలో కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం వేద పండితులు స్వామివారికి రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, రుద్రహోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. బెండపూడి, తమ్మయ్యపేట, నెల్లిపూడి, అన్నవరం, గోపాలపట్నం, పి.ఇ.చిన్నాయపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

జగ్గంపేట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. జలియన్ వాలాబాగ్ ఘటనను స్మరించుకుంటూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ జలియన్ వాలాబాగ్ దుర్ఘటనలో బ్రిటిష్ ముష్కరులు 379 మందిని అమానుషంగా కాల్చిచంపారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం అసువులుబాసిన వారి త్యాగాలను మరువలేమన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, జిల్లా నేతలు దేసేటి సురేష్, డాన్ శ్రీను, దేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

శాప్ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా లోవదుర్గ



ప్రత్తిపాడు రూరల్: శెట్టి బలిజ యాక్షన్ ఫోర్స్ (శాప్) ప్రత్తిపాడు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన న్యాయవాది కాకరపల్లి లోవదుర్గ నియమితులయ్యారు. ఈ మేరకు శాప్ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ ఆదేశాలు జారీ చేసినట్టు స్థానిక శెట్టిబలిజ సంఘం నేతలు రాళ్ల సీతారాం, వాసంశెట్టి సూర్యఅర్జున్ గురువారం తెలిపారు. శాప్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన లోవదుర్గకు పలువురు ప్రజాప్రతినిధులు, సంఘ నేతలు అభినందనలు తెలిపారు.

ఆ ప్రచారం అవాస్తవం

శంఖవరం: అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలో ఎటువంటి ర్యాలీలు, సభలకు అనుమతి లేదని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తమని ఎస్సై శోభన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతేడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా శంఖవరంలో జరిగిన ర్యాలీలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన అల్లర్ల దృష్ట్యా అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. సీఐ కే కిషోర్‌బాబు ఆదేశాల మేరకు ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి శాంతియుత వాతావరణంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించుకోవాలని సూచించామన్నారు. సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు రెచ్చగొట్టేలా వార్తలను వక్రీకరించి ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

రౌతులపూడి: మండలంలోని కొట్టం–రౌతులపూడి రహదారిలో గురువారం ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డికి విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. గడ్డి ట్రాక్టర్‌కు ములగపూడి వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ట్రాక్టర్‌ను గ్రామ శివారులో ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమదంలో గడ్డి మెత్తం కాలిపోయింది. ట్రాక్టరు నాలుగు చక్రాలు దగ్ధమయ్యాయి. ట్రాక్టర్ కోటనందూరు మండలం కేఓ. మల్లవరానికి చెందిన వేముల వరహాలుబాబుకు చెందినదిగా గుర్తించారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

ప్రత్తిపాడు: స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఎన్నికల నిర్వహణ విధానంపై ఆ పార్టీ శ్రేణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చంద్రమౌళి ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. తొలుత వరుపుల రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గేటు పడితే.. గుండెల్లో దడ

- అన్నవరం రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య
- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆర్వోబీ నిర్మించాలని కోరుతున్న జనం



అన్నవరం రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

తొండంగి: మండలంలోని అన్నవరం (గోపాలపట్నం) రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రైల్వే గేటు పడితే గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు అన్నవరం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని తీరప్రాంతం బీచ్‌రోడ్డుకు అనుసంధానంగా తొండంగి, శృంగవృక్షం, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, అన్నవరం మీదుగా హైవేను చేరుకునేందుకు ప్రధాన రహదారిగా ఉంది. నిత్యం వేలాది మంది ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డులో గోపాలపట్నం (అన్నవరం) వద్ద రైల్వే ట్రాక్ ఉంది. రైళ్ల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరగకుండా ఇక్కడ రైల్వే గేటు ఏర్పాటు చేశారు. కాగా తరచూ రైల్వే గేటు పడడంతో వాహనాలు కిలో మీటరు మేర నిలిచిపోతున్నాయి.

పెరిగిన వాహనాల రాకపోకలు

ఇటీవల ఈ రహదారిలో వాహనాల రాకపోకలు పెరిగాయి. మండలంలోని ఇప్పటికే హేచరీలతో పాటు జీడిపిక్కల, తాండ్ర తయారీ, ఇటుకల తయారీ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా తీరప్రాంతంలో పెద్దతరహా పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటికి సంబంధించిన ముడిసరుకుల, ఉత్పత్తి సరుకుల రవాణాకు సంబంధించి చిన్న, భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి.

గంటల తరబడి

నిత్యం విశాఖ వైపు వెళ్లే ట్రాక్‌లో 74 రైళ్లు వస్తున్నాయి. రెండో వైపు కూడా అదే సంఖ్యలో పాసింజర్, గూడ్స్ రైళ్లు వెళ్తున్నాయి. అంటే దాదాపుగా 140 నుంచి 160 రైళ్లకు గేటు వేయాల్సి వస్తుంది. ఒక్కోసారి నాలుగైదు రైళ్లు వెళ్లే వరకూ కూడా గేటు తీయపోవడంతో వాహనదారులు గంట నుంచి రెండు గంటల వరకూ ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. గేటు వేస్తే రహదారిలో రెండు వైపులా దాదాపు కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల వరకూ వాహనాలు నిలిచిపోతున్నాయి. టిప్పర్‌లారీలు, స్కూల్ బస్సులు, గూడ్స్ వాహనాలు, ఆటోలు, బైకులు, కార్లు వ్యవసాయపరంగా ట్రాక్టర్లు తదితర వాహనాల విపరీతంగా రాకపోకలు సాగించడంతో ఒక్కోసారి అంబులెన్స్‌లో రోగులకు సకాలంలో వైద్యం అందించలేని సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం వేసవి కావడంతో గేటు వేస్తే ఎండలో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మించి ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అన్నవరం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యమైంది. సమస్యను రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించాం. త్వరలో ఆర్వోబీ నిర్మాణానికి అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

–నాగం గంగబాబు, వైస్ ఎంపీపీ, తొండంగి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



నిత్యం వివిధ పనుల రీత్యా తొండంగి నుంచి గోపాలపట్నం మీదుగా అన్నవరం వెళ్తుంటాం. రైల్వేగేటు ఒక్కోసారి నాలుగైదు రైళ్లు వెళ్లే వరకూ వేస్తున్నారు. దీంతో వాహనాలన్నీ కిలోమీటర్ల మేర నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నాం. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మించాలి.

–సోము లచ్చారావు, గ్రామస్తుడు, ఏ.కొత్తపల్లి

టెన్త్ పరీక్షలకు పది మంది గైర్హాజరు

గండేపల్లి: మండలంలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 500 మంది విద్యార్థులకు గాను 490 మంది పరీక్షలకు హాజరైనట్టు వివరించారు.

ప్రత్తిపాడు మండలంలో ఎనిమిది మంది

ప్రత్తిపాడు: మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షలకు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో 189 మందికి 188 మంది, ధర్మవరం జెడ్పీ హైస్కూల్‌లో 167 మందికి 163 మంది, లంపకలోవ జెడ్పీ హైస్కూల్‌లో 260 మందికి 257 మంది హాజరుకాగా ఒమ్మంగి జెడ్పీ హైస్కూల్ ఎ సెంటర్‌లో 180 మంది, ఒమ్మంగి బి సెంటర్‌లో 149 మంది వెరసి 950 మందికి గాను 942 మంది పరీక్షలకు హాజరైనట్టు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును స్థానిక సీఐ కె. కిషోర్ బాబు పర్యవేక్షించారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

తుని: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు గురువారం తెలిపారు. స్థానిక గొల్లఅప్పారావు సెంటర్లో ఉదయం 10 గంటలకు నిర్వహించే జయంతి వేడుకల్లో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఆనందమానందమాయె..

- నెరవేరిన 1998 డీఎస్సీ అభ్యర్థుల కల
- తుని పట్టణానికి చెందిన ఇద్దరికి కొలువులు



తుని మండలం జిల్లేడుపాడు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా రిపోర్టు చేస్తున్న ఆరుగుల రవికుమార్

తుని: గురువు అంటే ప్రతిఒక్కరికీ ఎనిలేని గౌరవం. తల్లిదండ్రుల తర్వాత గురువు మాత్రమే అంతటి గౌరవాన్ని పొందుతారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఉపాధ్యాయ కొలువును సాధించేందుకు యువత పరితపిస్తారు. జీవితంలో స్థిరపడాలని 1998 డీఎస్సీ పరీక్షకు హాజరై అర్హత సాధించిన వారిలో కొందరికి అప్పటి ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఉద్యోగం అందని ద్రాక్షగా మిగిలిపోయింది. కోర్టులను ఆశ్రయించి రాజీలేని పోరాటం చేసి విసిగిపోయిన అభ్యర్థులు వేర్వేరు రంగాల్లోకి వెళ్లిపోయారు. కొందరు ప్రజా ప్రతినిధులైతే మరి కొందరు ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులో తమకు సువర్ణావకాశం వస్తుందని ఎవ్వరు ఊహించలేదు. సరిగ్గా నాలుగేళ్ల క్రితం ప్రజా సంకల్పయాత్ర చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి 1998 డీఎస్సీ అభ్యర్థులు తమ వేదనను మొరపెట్టుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకున్నారు. తుని పట్టణ పరిధిలో ఇద్దరు గురువారం ఉపాధ్యాయులుగా చేరారు. వీరి కుటుంబాల్లో ఆనందం మాటల్లో వర్ణించలేం.

జగనన్న చలువే నన్ను ఉపాధ్యాయుడిని చేసింది

ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నదే నా జీవిత ఆశయం. అందుకే ఎంతో కష్టపడి చదివి 1998 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించాను. అప్పటి ప్రభుత్వం సాంకేతిక కారణాలతో మా ఆశలపై నీళ్లు చల్లింది. ఉద్యోగం రాక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డిపై ఇష్టంతో వైఎస్సార్ సీపీలో చేరాను. 2021లో తుని మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు నుంచి వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి ప్రజా ప్రతినిధిగా గెలిచాను. రెండేళ్ల పాటు కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలు అందించాను. ప్రభుత్వం బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో తుని మండలం జిల్లేడుపాడు ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా ఉద్యోగం వచ్చింది. నాకు అండగా నిలిచి ప్రజలు గెలిపించిన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశాను. విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం ఆనందంగా పని చేస్తాను.

– ఆరుగుల రవికుమార్, ఉపాధ్యాయుడు, తుని

ఆనందానికి అవధుల్లేవు

ప్రభుత్వ ఉద్యోగంలోకి చేరతానని కలలో ఊహించలేదు. ఉపాధ్యాయుడు కావాలని డీఎస్సీ రాసి 25 ఏళ్లు అవుతుంది. గత ప్రభుత్వం మా మొరను ఆలకించలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మానవత్వాన్ని చాటింది. ఎన్నో ఏళ్ల పోరాటనికి ప్రతిఫలం లభించింది. బుధవారం కాకినాడలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో తుని మండలం సుభద్రయ్యమ్మపేట ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా ఉద్యోగం వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. సర్వీసు ఎన్నాళ్లు అన్నది ముఖ్యం కాదని జీవిత ఆశయం నేరవేరడం ఆనందంగా ఉంది.

– బిక్కిన కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయుడు, తుని

మామిడి తోటల పరిశీలన



మండపంలో మామిడితోటను పరిశీలిస్తున్న హెచ్ఓ అరుణ్‌కుమార్

శంఖవరం: మండపం గ్రామంలోని మామిడి తోటలను ఉద్యానవన అధికారి అరుణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. మామిడి కాయలకు పండు ఈగ తెగులు ఆశించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కాయలు పక్వానికి వచ్చిన తరువాత ఆలస్యంగా కోత కోస్తే పండుఈగ తెగులు ఆశిస్తోందన్నారు. ఈ తెగులు ఆశించిన తోటల్లో రాలిపోయిన పండ్లను రైతులు ఎప్పటికప్పుడు ఏరి నాశనం చేయాలన్నారు. ఈ తెగులు నివారణకు ప్లాస్టిక్ పళ్లెంలో మిథైల్ యుజినాల్ 2 మిల్లీలీటర్లు, 3 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు ఒక లీటరు నీటిలో కలిపి తోటలో వేలాడకట్టాలని సూచించారు. మార్కెట్‌లో లభ్యమయ్యే పండుఈగ ఎర బుట్టను ఎకరానికి 5 చొప్పున కొమ్మలకు కట్టాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై అపరాల విత్తనాలు

కిర్లంపూడి: గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అన్నదాతలకు సబ్సిడీపై అపరాల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి జోకా అమృత గురువారం తెలిపారు. పెసలు, మినుములు, జనుము, జీలుగ తదితర అపరాల విత్తనాలను 50 శాతం సబ్సీడితో రైతులకు అందిస్తున్నట్టు చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



సునీత కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలో బెండపూడి గ్రామానికి చెందిన చీమల సునీత గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. గతంలో ఆమె సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని స్వయంగా కలిసి తన సమస్యను వివరించింది. స్పందించిన సీఎం జగన్ తక్షణమే సునీతకు పింఛను ఇవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం సునీతకు నెలకు రూ.10 పెన్షన్ అందుతోంది. దీంతో పాటు సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరైంది. ఈ చెక్కును గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుకూరి వీర వెంకట సత్యనారాయణ(పెద్దబ్బు), ఆరుమిల్లి ఏసుబాబు లబ్ధిదారు సునీతకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసాల గణపతి, వైస్ సర్పంచ్ సోమిశెట్టి చలపతి, ఏలేటి ధర్మరాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

కిర్లంపూడి: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి శివపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై గురువారం ఎస్సీ ఎస్టీ సెల్–1 డీఎస్పీ బి.అప్పారావు, స్థానిక ఎస్సై టి.రఘునాథరావుతో కలిసి గోనేడలో సాక్షులను విచారించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 1న కుక్కపిల్ల విషయంలో జరిగిన వివాదంలో కొప్పిశెట్టి శివ కులం పేరుతో దూషించి, తనను కొట్టినట్టు బాధితుడు గొల్లపల్లి సుధీర్ ఈ నెల 11న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కొప్పిశెట్టి శివపై స్థానిక ఎస్సై రఘునాథరావు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో గురువారం విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎస్పీ అప్పారావు తెలిపారు.

నష్టపరిహారం ఇప్పించాలని వినతి



ప్రత్తిపాడులో తహసీల్దార్ గోపాలకృష్ణకు సమస్యను వివరిస్తున్న రైతులు

ప్రత్తిపాడు: వైరస్ సోకి పంట నష్టపోయిన తమకు నష్ట పరిహారం మంజూరు చేయాలని మండలంలోని టి.రాయవరం రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. టి.రాయవరంలో సాగు చేసిన వరి పంటలో సుమారు 80 ఎకరాల మేర పంటకు వైరస్ సోకిందని, దీని వల్ల పక్వానికొచ్చిన వరి వెన్ను విరిగి పంట నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం ద్వారా బీమా సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణ ఫోన్‌లో జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్‌తో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు సీంద్రపు సుబ్బారావు, బత్తుల శ్రీను, చిలకమర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు



వి.కొత్తూరు కేజీబీవీలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా బాలికా సంరక్షణ అధికారి ఉమామహేశ్వరి

తుని రూరల్: వి.కొత్తూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జిల్లా బాలికా సంరక్షణ అధికారి పి.ఉమామహేశ్వరి గురువారం తనిఖీలు చేశారు. పాఠశాలలో భోజనశాల, స్టాక్ రూమ్‌లో నిత్యవసర సరకులు, రికార్డులు, హాజరు పట్టీలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులను కలిసి పరీక్షలు రాస్తున్న తీరు, ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. వచ్చే విద్యా సంవత్సరంలో బోధన మెరుగుపర్చుకునేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ అమృతవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీటి సరఫరాకు అంతరాయం

తుని: ప్రధాన పంపు హౌస్ మరమ్మతుల కారణంగా శుక్రవారం నుంచి పట్టణంలోని పది వార్డుల్లో నీటి సరఫరాకు స్వల్ప అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. పట్టణంలోని 1 నుంచి 10 వార్డులకు కత్రాళ్లకొండ, తుని మండలం రేఖవానిపాలెం పంపు హౌస్‌ల నుంచి నీటి సరఫరా జరుగుతోందన్నారు. రేఖవానిపాలెం పంపుహౌస్‌కు తాండవ నదిలో 18 మీటర్ల లోతులో ఇన్ ఫిల్టరేషన్ ప్లాంట్ ఉందన్నారు. దీనిలో ఒండ్రుమట్టి చేరడంతో నీరు రంగు మారి నల్లగా వస్తుందని పలువురు ఫిర్యాదు చేశారన్నారు. ఈ పంపుహౌస్‌లో శుక్రవారం నుంచి క్లీనింగ్ పనులు ప్రారంభిస్తామని, కత్రాళ్ల కొండ పంపు హౌస్ మాత్రమే పని చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలకు ఉదయం 6.30 నుంచి 7.30 గంటలు, సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు మాత్రమే నీటి సరఫరా ఉంటుందన్నారు. ఈ నెల 17 వరకూ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

50 మందికి కంటి వైద్య పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు సతీష్

ఏలేశ్వరం: పట్టణ పరిధిలోని అప్పనపాలెంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి సౌజన్యంతో కౌన్సిలర్ దేగల శేషారత్నం, దేగల వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బొమ్మూరుకు చెందిన వైద్యుడు సతీష్ 50 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత సుంకర సుబ్బారావు, వీఆర్వో పడాల వీరేశ్వరరావు, దేగల గంగాధర్, దనేకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



రౌతులపూడిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఏలేశ్వరంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తుని మండలం మర్లపాడులో పథకాలు వివరిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏలేశ్వరం 12వ వార్డులో వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్, 9వ వార్డులో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వాగు బలరాం, 10వ వార్డులో కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్ సర్వే

తుని రూరల్: మండలంలో జగనన్నే మా భవిషత్ సర్వే జోరుగా సాగుతోంది. చామవరం, మర్లపాడు, ఎస్.అన్నవరం, కొత్త సూరవరం, ఎన్.సూరవరం, డి.పోలవరం, కేఓ.మల్లవరం, తేటగుంట, వి.కొత్తూరు, ఎ.అగ్రహారం, వల్లూరు, రాపాక, తదితర గ్రామాల్లో గురువారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని సర్వే చేశారు. కార్యక్రమంలో తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, మైనార్టీ సెల్ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డాది ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు ఇందిరా కాలనీలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు గత వ్యత్యాసాన్ని వివరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఏడిద రెడ్డినాయుడు పాల్గొన్నారు.

రౌతులపూడి: గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్ ఎంపీపీలు సాయి, లక్ష్మీ భాస్కరబాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

కోటనందూరు: మండలంలోని టీజే నగరంలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సుర్ల రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి జగన్ పాలన, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. సీఎం జగన్ పరిపాలనపై అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు పాల్గొన్నారు.